

సూర్య — సేటి దినపత్రిక

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,30 డిశంబర్ 2025


8 పేజీలు


# కాకినాడ కే.ఎస్.పి.ఎల్.లో రేషన్ బియ్యం మాఫియా

# గుట్టు రట్టు !



కె.ఎస్.పి.ఎల్.లో వట్టిపోతున్న నిఘా.. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డాగా చెక్ పోస్టులు



ఓ అధికారి అక్రమాలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు.. రశీదు విడుదల

- డి.ఎస్.ఓ అవినీతిపై కలెక్టరేట్‌లో "వరల్డ్ కన్స్యూమర్ రైట్స్" రాష్ట్ర అధ్యక్షుల సంచలన ఫిర్యాదు
- జాయింట్ కలెక్టర్ పరివేక్షణలో విచారణ !
- గడిచిన ఎనిమిది నెలల కాల్ రికార్డులు, గూగుల్ టవర్ సిగ్నల్ లొకేషన్ తనిఖీతో అధికారి అవినీతి వెలుగులోకి...



కె.ఎస్.పి.ఎల్. గేటు దాటిస్తున్న రేషన్ బియ్యం.. సహకరిస్తున్న డి.ఎస్.ఓ.! అంటూ కలెక్టర్‌కి ఫిర్యాదు

కాకినాడ డీప్ వాటర్ పోర్ట్ సాక్షిగా పేదల ఆకలిని విదేశాలకు అమ్మేస్తున్న భారీ స్కాంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణ రాజు పాత్రపై బాంబు పేల్చారు వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వి.సత్యనారాయణ నాగిరెడ్డి. "30 లక్షలు ఇచ్చి పోస్టింగ్ తెచ్చుకున్నా... వంద రెట్లు సంపాదిస్తా" అంటూ సదరు అధికారి విర్రవీగుతున్న తీరు జిల్లాలో సంచలనం రేపుతోంది. చెక్-పోస్టులను నిర్వీర్యం చేసి, సీసీ కెమెరాలు కట్టేసి మరి ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న కాల్ డేటా, గూగుల్ లొకేషన్‌లో మిస్టరీ ఇప్పుడు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.. దీనిపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో ప్రజా ప్రయోజనార్థం అందించిన ప్రత్యేక కథనం...

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

కాకినాడ జిల్లాలో నిరుపేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం, అధికారుల అండదండలతో విదేశాలకు తరలిపోతోందని వరల్డ్‌కన్స్యూమర్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వి.వి. సత్యనారాయణ నాగిరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.ఎస్.ఎస్. సత్య నారాయణ రాజు (డీఎస్ఓ) పై ఆయన రాతపూర్వక ఫిర్యాదును అందజేశారు.

**ప్రధాన ఆరోపణలు : మాఫియాతో చేతులు కలిపిన అధికారి :** రేషన్ మాఫియా డాన్‌లతో డిఎస్ఓ లాలూచీ పడి, కాకినాడ డీప్ వాటర్ పోర్టు ద్వారా పేదల బియ్యాన్ని విదేశాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారని నాగిరెడ్డి మండిపడ్డారు.

**కాల్ డేటా వెరిఫై చేస్తే గుట్టు బయటపడుతుంది :** గత ఎనిమిది నెలలుగా డీఎస్ఓ అధికారిక ఫోన్ యొక్క ఇన్కమింగ్, అవుట్ గోయింగ్ కాల్స్‌తో పాటు వాట్సాప్ కాల్ డేటాను నిశితంగా

- తరువాయి 2లో..

# నూతన సంవత్సర కానుక

డిసెంబర్ 31న ఇంటి వద్దే 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ
- ఒక రోజు ముందుగానే పింఛన్ పంపిణీకి కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశం
- జిల్లాలో 2.70 లక్షల మందికి రూ.117.94 కోట్ల నిధులు సిద్ధం
- తొలిరోజే 100 శాతం పంపిణీ లక్ష్యం - ఉదయం 6:30 గంటలకే ఇంటి వద్దకు సిబ్బంది



**కాకినాడ,మేజర్‌న్యూస్** : జనవరి 1నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని పింఛను దారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2026 జనవరి నెలకు సంబంధించి 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక భద్రతా పింఛన్లను ఒక రోజు ముందుగానే, అంటే డిసెంబర్ 31న పంపిణీ చేయనున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ప్రధానాంశాలు:సకాలంలో పంపిణీ :** జనవరి 1వ తేదీ సెలవు దినం మరియు పండుగ వాతావరణం ఉన్నందున, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

**- లబ్ధిదారుల వివరాలు** : జిల్లా వ్యాప్తంగా 2,70,550 మంది లబ్ధిదారులకు గాను మొత్తం రూ.117.94 కోట్లు పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

**కొత్త పింఛన్లు :** ఈ నెలలో జిల్లా వ్యాప్తంగా కొత్తగా 448 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని, వారికి కూడా ఈ నెలే సొమ్ము అందజేస్తామని తెలిపారు.

**సమయపాలన :** బుధవారం డిసెంబర్ 31 ఉదయం 6:30 గంటల నుంచే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి సొమ్ము అందజేస్తారు.

- తరువాయి 2లో..

## రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌కు

# కేబినెట్ ఆమోదం

- వైసిపి తప్పుడు ప్రచారానికి ఈ నిర్ణయంతో చెక్ : మంత్రి సుభాష్

రామచంద్రపురం నియోజవర్గ ప్రజలకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన ప్రత్యేక కృషితో రామచంద్రపురం రెవిన్యూ డివిజన్‌ను యధార్థంగా కొనసాగిస్తూ సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్డిఓ, డిఎస్పీ కార్యాలయాలు ఇక్కడే కొనసాగితాయని స్పష్టం చేయడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి...



రామచంద్రపురం డివిజన్ ప్రజల తరఫున సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి సుభాష్

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్** : రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ విషయంలో నెలకొన్న అనిశ్చితికి తెరదించుతూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.సోమవారంజరిగిన కేబినెట్ సమావేశంలో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌ను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**ముఖ్య అంశాలు :**

- తరువాయి 2లో..

### కాకినాడ కే.ఎస్.పి.ఎల్.లో

# రేషన్ బియ్యం మాఫియా గుట్టు రట్టు!

మొదటిపేజి తరువాయి

వెరిఫై చేయాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. అతిపెద్ద రేషన్ కార్డులు మాఫియా ఈ డీఎస్ఓ చేతుల్లోనే ఉందని, కాల్ డేటాతోపాటు, గూగుల్ మ్యాప్ లొకేషన్ సిగ్నలింగ్ వ్యవస్థతో ఎక్కడెక్కడ ఈ అధికారి తిరిగి తనిఖీలు చేసి ఏయే మిల్లర్లను భయపెట్టి లక్షల్లో లంచాలు దిగమింగాడో బయట పెట్టి, అతను తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని చెక్ పోస్టులు నిర్వీర్యం చేసి లక్షల్లో లంచాలు మెక్కారో పూర్తి ఆధారాలు దొరుకుతాయని సత్యనారాయణ అన్నారు.

**చట్టాల ఉల్లంఘన :** నిత్యావసర వస్తువుల చట్టం (1955), ఆంధ్రప్రదేశ్ పిడిఎస్ కంట్రోల్ ఆర్డర్ (2018), మరియు ఐపిసి 409, 120బి వంటి సెక్షన్ల కింద ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.

**నిర్వీర్యమైన చెక్-పోస్టులు :** అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన చెక్-పోస్టులను డిఎస్‌వో ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేసి, సీసీ కెమెరాలను నిలిపివేసి, లక్షల్లో మామూళ్లు దండుకుంటున్నారని ఆరోపించారు.

**లంచం ఆరోపణలు :**తాను రూ.30లక్షలు లంచం ఇచ్చి ఈ పోస్టింగ్‌లోకి వచ్చానని, వంద రెట్లు సంపాదిస్తానని సదరు అధికారి బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నట్లు రైస్ మిల్లర్లు వాపోతున్నారని ఆయన పేర్కొన్నారు.

**డిమాండ్లు :**ప్రస్తుతం పోర్టులో ఎగుమతికి సిద్ధంగా ఉన్న కంటైనర్లను టెక్నికల్ ఆఫీసర్ల బృందంతో తక్షణమే తనిఖీ చేయించాలి.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎస్ఓ ని వెంటనే విధుల్లోంచి తొలగించి, ఏసీబీ ద్వారా ఆయన ఆస్తులపై విచారణ జరిపించాలి.


"ప్రభుత్వ వ్యవస్థలో ఉంటూ మాఫియాకు సహకరిస్తున్న ఇలాంటి 'అవినీతి తిమింగలాల'ను వదిలిపెట్టకూడదు. పేదల బియ్యం పేదలకు అందేలా చూడటమే మా లక్ష్యం" అని వి.వి.సత్యనారాయణ నాగిరెడ్డి స్పష్టం చేశారు.

# రెవిన్యూ అంశాల పరిష్కారం నిమిత్తం 'రెవెన్యూ క్లినిక్'

**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని భూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలుపైన రెవెన్యూ అంశాల పరిష్కార వేదిక "రెవెన్యూ క్లినిక్" కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావుతో కలిసి రెవిన్యూ క్లినిక్ నిర్వహణను పరిశీలించి, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా రెవిన్యూ అంశాల పరిష్కారం నిమిత్తం ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలోని రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, సర్వే అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. అర్జీదారుని సమస్యకు సంబంధించిన కౌంటరుకు పంపించడం జరుగుతుందన్నారు. సమస్యకు సంబంధించి వివరాలను అర్జీదారునితో సంబంధిత మండల రెవెన్యూ అధికారులు క్షుణంగా చర్చించి, తీసుకోనున్న చర్యలను వివరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి యాక్షన్ టూబి టేకెన్ షీట్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. సర్వేకు సంబంధించినటువంటి అంశాలకు, ల్యాండ్ డి-పట్టాకు సంబంధించినవి ఏమైనా ఉన్నట్లయితే ఫీల్డ్ మీదకు వెళ్లాల్సి వస్తే ఏ తేదీన ఫీల్డ్‌కు అధికారులు వెళ్తారో ముందుగానే అర్జీదారునికి తెలియపరచడం జరుగుతుందన్నారు. సోమవారం నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో వివిధ రెవెన్యూ అంశాలపై 110 అర్జీలు దాఖలయ్యాయని ఆయన వివరించారు. ఈ రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# గ్రీవెన్స్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**– ఐటీడీఏ పివో స్మరణ్ రాజ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గత వారం పిజిఆర్ఎస్ (గ్రీవెన్స్) కు వచ్చిన సమస్యలు దరఖాస్తులు పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో వివిధ శాఖల సెక్టార్ అధికారులతో ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ గత వారంలో వివిధ సమస్యలకు సంబంధించి ఒక్కొక్క శాఖకు ఎన్ని దరఖాస్తులు వచ్చినది, ఎన్ని పరిష్కరించింది లేనిది ఆయన ఆరా తీశారు. పరిష్కారం కాని దరఖాస్తులు ఎందుకు పరిష్కారం కాలేదో తెలియజేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అన్ని మండలాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీజీ ఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించింది లేనిది అడిగి తెలుసుకున్నారు. ప్రతివారం వివిధ శాఖలకు సంబంధించిన ప్రజల సమస్యల దరఖాస్తులు అప్లోడ్ చేసి, వాటిని వెంటనే ఓపెన్ చేసి సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డి.ఎన్.వి. రమణ, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, డిఎల్ డి వో కె. కోటేశ్వరరావు, ఎడియం అండ్ హెచ్ ఓ డాక్టర్ పి.సరిత, ఎడీఏ రామ్మోహన్, పిహెచ్ఓ దేవదానం, జిసిసి డిఎం జయశ్రీ, పిఏఓ.ఎల్.రాంబాబు, తహసిల్దార్ పి.బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్ , సిడిపివోలు క్రాంతి కుమారి, ప్రత్యక్ష లక్ష్మి, కె.ఉమా, శాంతి కుమారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, సుబ్బయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, శివ మల్లికార్జునరావు, సుబ్బారావు, భవానీ, డాక్టర్ శ్వేత, వెలుగు ఏపిడి దేగలయ్య, డిప్యూటీ తహసిల్దార్లు రవీంద్రబాబు, జిలానీ, శ్రీధర్, సబ్ రిజిస్టర్ ఉపేంద్ర, ఉపాధి హామీ పథకం ఏపీడి శ్రీనివాస్ విశ్వనాథ్, పీఎంయు అధికారి చంద్రకళ, ఏ వో పి.జయంతి తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో సమస్యలపై వినతులు

రంపచోడవరం ఐటిడిఏ సమావేశపు హాలులో వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ సాహిత్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈ వారం వివిధ సమస్యలపై సుమారు 78 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. రంపచోడవరం మండలం సీమగండి నుండి వేములకొండ గ్రామం వరకు సుమారు 20 కిలోమీటర్ల రహదారి సరిగా లేక చాలా ఇబ్బంది పడుతున్నామని, వెంటనే స్పందించి సుమారు 20 కిలోమీటర్లకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని కుర్ల అబ్బాయి రెడ్డి, కోండ్ల. శ్రీదేవి, కుర్ల మెహర్ వాణి, రేవుల గంగ భవాని దరఖాస్తు సమర్పించారు. వికలాంగుడనని, తన కుటుంబం పోషణకు చాలా ఇబ్బందులు పడుతున్నామని, వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామానికి చెందిన ఎర్ర శ్రీను దరఖాస్తు సమర్పించారు. దేవీపట్నం మండలం దొనలంక గ్రామంలో ప్రభుత్వం ద్వారా గంగాలమ్మ గుడి భవనం మంజూరు చేయాలని కర్రి లింగారెడ్డి, అర్థికుల సత్తిబాబు దరఖాస్తు సమర్పించారు. దేవీపట్నం మండలం వెలగపల్లి నుండి దోనలంక మీదుగా సిహెచ్ గంగవరం, పెద్ద నూతులు గ్రామాలకు లింకు రోడ్డు ఏర్పాటు చేయాలని సర్పంచ్ కె.శివారెడ్డి, లింగారెడ్డి దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర కానుక

మొదటిపేజి తరువాయి

**అధికారులకు కఠిన ఆదేశాలు :** తొలిరోజే 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది, ఇతర యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని, ఎక్కడా ఫిర్యాదులకు తావులేకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలని సూచించారు.

మండలాల వారీగా నిధుల కేటాయింపు : జిల్లాలో అత్యధికంగా కాకినాడ అర్బన్‌లో 29,243 మందికి రూ.12.75 కోట్లు, కాకినాడ రూరల్‌లో 18,166 మందికి రూ.7.84 కోట్లు పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా కొత్తపల్లి (రూ.5.27 కోట్లు), తొండంగి (రూ.5.47 కోట్లు), తుని (రూ.5.35 కోట్లు) మండలాలకు భారీగా నిధులు విడుదలయ్యాయి. అవ్వతాతలు, దివ్యాంగులు మరియు ఇతర పింఛనుదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని, సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

# రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌కు కేబినెట్ ఆమోదం

మొదటిపేజి తరువాయి

**రెండు మండలాల ప్రత్యేకత :** రామచంద్రపురం, కె.గంగవరం మండలాలు మరియు రామచంద్రపురం మున్సిపాలిటీతో కలిపి ఈ డివిజన్ కొనసాగుతుంది. రాష్ట్ర చరిత్రలో కేవలం రెండు మండలాలతో ఒక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కావడం ఇదే తొలిసారి. ఇలా రామచంద్రపురం ఖ్యాతిగాంచింది.

**యధావిధిగా కార్యాలయాలు :** ఆర్డీవో మరియు డిఎస్పీ కార్యాలయాలు రామచంద్రపురంలోనే యధావిధిగా కొనసాగుతాయి.

**మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు ఈ నిర్ణయాన్ని అమలు చేశారు."వైసీపీ చేసిన తప్పుడు ప్రచారానికి ఈ నిర్ణయం చెక్ పెట్టింది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. రామచంద్రపురం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది." – వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి

**ప్రయోజనాలు :**

**– త్వరితగతిన పరిష్కారాలు :** తక్కువ విస్తీర్ణం ఉండటం వల్ల ప్రజల సమస్యలపై అధికారులు త్వరగా దృష్టి సారించే అవకాశం ఉంటుంది.

– **పరిపాలనా సౌలభ్యం :** నియోజకవర్గ కేంద్రంలోనే కీలక కార్యాలయాలు ఉండటం వల్ల ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గుతాయి.

# సీఐ కన్నప్ప రాజు, ఎస్సై అప్పలరాజులకు ఉత్తమ ప్రతిభ ప్రశాంసా పత్రం





ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో నేరల సంఖ్య తగ్గించిందుకు గాను ఉత్తమ ప్రతిభ ప్రశంస పత్రాన్ని జిల్లా ఎస్సి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లా అధికారులతో వార్షిక నేర సమీక్షా సమావేశం జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. 2025 సంవత్సరంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీస్ స్టేషన్ పరిధిలో నేరల సంఖ్య తగ్గించి, పేరుకుపోయిన కేసులను చేధించి, ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఉత్తమ ప్రతిభ ప్రశంస పత్రాన్ని జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ చేతుల మీదుగా ఎటపాక సీఐ కె.కన్నప్ప రాజు, ఎటపాక ఎస్సై జి.అప్పలరాజు అందుకోవడం జరిగింది.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో యాక్టరమ -2025

**– భాషా నైపుణ్యాలే బ్రతుకుతెరువుకు సోపానాలు**

**– అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం పోచయ్య**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో యాక్టరమ-2025 నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో యాక్టరమ-2015 పేరుతో వివిధ నాటక పోటీలు నిర్వహించారు. మర్చంట్ ఆఫ్ వెనిస్, షేక్స్పియర్స్ న్యూ ఎరా వంటి అంశాలపై విద్యార్థులు విభిన్న రీతులలో నాటక ప్రదర్శనలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన మరియు ప్రార్ధన గీతంతో ప్రారంభమైన ఈ వేడుకలను ప్రారంభించిన డాక్టర్ నాయుడు మాట్లాడుతూ నేటి సాంకేతిక ప్రపంచంలో ఆంగ్లానికి అధిక ప్రాధాన్యత ఉందని, ఆదిత్య డిగ్రీ కళాశాలలలో కమ్యూనికేషన్ మరియు కాంపిటేటివ్ ఇంగ్లీష్ కు ప్రత్యేక ప్రాధాన్య ఇస్తున్నామని తెలిపారు. చక్కని నాటక ప్రదర్శనలు చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎమ్మెస్ అండ్ క్యాంపస్ ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం పోచయ్య మాట్లాడుతూ ఈ విధమైన విభిన్న కార్యక్రమాలు నిర్వహించిన ఆంగ్ల విద్యార్థులకు అభినం దనలు తెలిపారు. సందేశాత్మకమైన నాటకాలు సమాజాన్ని మేలుకొలుపు తాయని అన్నారు. భాష నైపుణ్యాలు బ్రతుకుతెరువుకు సోపానాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ వి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషతో పాటు ఇంగ్లీష్ మీద మంచి పట్టు సాధించాలని, క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఇంగ్లీష్ యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న గ్రూప్ డిస్కషన్ విధానాన్ని తెలుసుకొని అభినందించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన నాటక పోటీల విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలను మరియు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆంగ్ల విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి,అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఆంగ్ల శాఖాధిపతి ఎల్ వి ఎస్ వర ప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# 31వ తేదిన ఫించన్లు పంపిణీ

**– కమీషనర్ శ్రీకాంత్‌రెడ్డి**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మ కంగా అమలు చేస్తున్న ఎన్టిఆర్ భరోసా ఫించన్లు పంపిణీ పెద్దాపురం పురపాలక సంఘం పరిధిలో ఫించన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదిన ఉదయం 7 గంటల నుండి ఫించన్లు పంపిణీ చేయబడునని మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. 31వ తేదిన తీసుకోని వార్కి 2వ తేదిన పంపిణీ చేయడం జరుగుతుందని, పురపాలక సంఘంలో 5995 మంది ఫించనుదా రులకు రూ.2 కోట్ల 61 లక్షలలు మంజూరు అయ్యాయని వాటిని సచివాలయ సిబ్బంది పంపిణీ చేయడం జరుగుతుందని, కావున ఫించన్‌దారులు గమనించాలని కమీషనర్ సూచించారు.

# శ్రీ మరిడమ్మ అమ్మవార్కి బంగారు నత్తు, అడ్డపూస బహుకరణ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి పెద్దాపురం వాస్తవ్యులు పడాల రామలక్ష్మి మరియు లింగం నాగమణిలు సోమవారం బంగారు నత్తు, అడ్డపూసను (9 గ్రాముల బంగారం) బహుకరిం చడం జరిగిందని దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా రామలక్ష్మి, నాగమణిలకు ఆలయ అర్చకు లచే ఆశీర్వాదం అందజేసి, శాలువతో సత్కరించి, తీర్ధప్రసాదం, అమ్మవారి ఫోటో అందజేశారు.

# విద్యా రంగంలో శివరామకృష్ణ సేవలు అమోఘం

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** విద్యారంగంలో ఎంఈఓగా పనిచేసి రిటైర్ అవుతున్న నివై శివరామకృష్ణయ్య సేవలు ఎంతో అమోఘం అమోఘం అని తెలుగుదేశం జిల్లా ఉపా ధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ పేర్కొన్నారు. సామర్లకోట మండల విద్యాశాఖాధికారిగా ఇప్పటివరకు విధులు నిర్వహించి ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న వై.శివరామకృష్ణయ్య దంపతులకు స్థానిక గాంధీ సెంటర్ వద్ద గల రైతు భవన్‌లో ఘనంగా వీడ్కోలు సత్కారం జరిగింది. స్థానిక రైతు సంఘ భవనంలో ఎంఈవో-2 పి పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్నత సేవలు అందించి విద్యాశాఖ అధికారిగా శివరామకృష్ణయ్య ఎంతో పేరుగాంచారన్నారు. అనంతరం పదవి విరమణ చేస్తున్న శివరామకృష్ణయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృతానరేష్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, తెలుగురైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ



చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మళ్ళ రామకృష్ణ, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి తోటకూర శ్రీనివాసరావు బీజేపీ నాయకులు విత్తనాల వెంకటరమణ, అధిక సంఖ్యలో టీచర్లు హెడ్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండండి

**– ఎస్ఐ శివకుమార్**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** విద్యార్థులు ర్యాగింగ్‌కి పాల్పడకుండా ఒకరికొకరు సోదర భావంతో మెలుగుతూ ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై శివకుమార్ విద్యార్థులకు సూచించారు. సోమవారం సాయంత్రం రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాగ్గింగ్, ఫేక్ ఏపీకె ఫైల్స్, ఆన్లైన్ ఫ్రాడ్స్, ఇవి టీజింగ్,శక్తి అప్, తదితర వాటిపై అవగాహన కల్పించి, విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలని, బాగా చదువుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఎస్సై శివకుమార్ కోరారు. ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే కళాశాల అధ్యాపకులతో గాని పోలీసులకు గాని తెలియపరచాలన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై శివకుమార్ విద్యార్థులను హెచ్చరించారు.

# న్యాయవాది కుటుంబానికి జడ్జి సంతాపం



ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : ఏలేశ్వరానికి చెందిన ప్రముఖ న్యాయవాది బాధా జాన్ బాబు (45) మృతికి ప్రత్తిపాడు న్యాయమూర్తి ఎల్. గోపీనాథ్, న్యాయవాదులు సంతాపం తెలిపారు. వివరాల్లోకెళ్తే ఏలేశ్వరంలో నివాసం ఉంటూ న్యాయవాది వృత్తి కొనసాగిస్తున్న బాధ జానుబాబు సోమవారం అకస్మాత్తుగా శ్వాసకోస వ్యాధితో మృతి చెందారు. విషయం తెలుసుకున్న న్యాయమూర్తి ఎల్ గోపీనాథ్, ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సమిష్టిగా మృతుడు జాన్ బాబు ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జాన్ బాబు ప్రతిభ గల న్యాయవాదే కాక మృదుస్వభావం కలవాడని కొనియాడారు. ఆయన వెంట ప్రతిపాడు బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కొల్లా వీర్రాజు, అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, పూర్వపు అధ్యక్షులు చలంకూరి రామకృష్ణ, బొగతా శివ, న్యాయవాదులు పిల్లి బలరాముడు, కాళీ ప్రసాదరావు, బొంగులూరి మధుబాబు, పలివెల నాగేంద్ర, పలువురు న్యాయవాదులు, గుమస్తాలు ఉన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# జనవరి 1నుండే నూతన జిల్లా ప్రారంభం!?

**– రంపచోడవరం కేంద్రంగా పోలవరం కొత్త జిల్లా**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం కేంద్రంగా పోలవరం కొత్త జిల్లా ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 2026 కొత్త సంవత్సరంలో జనవరి 1వతేదీ నుండి కొత్తజిల్లాపాలన మొదలవుతుందని సమాచారం. కొత్త జిల్లా ఏర్పాటుకు సోమవారం ప్రభుత్వం ఆమోదు ముద్ర వేసింది. ఈ నెల 31వ తేదీ కొత్త జిల్లాకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ప్రస్తుతం ఏఎస్ఆర్ జిల్లా పరిధిలోని రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాలతో పాటు కొత్తగా ప్రకటించిన గుర్తేడు మండలం కలవనుంది. కాగా పోలవరం నియోజకవర్గం పరిధిలోని 7 మండలాలు కలుపుతారా లేదా అనేది స్పష్టత రాలేదు. పోలవరం కొత్త జిల్లా ఏర్పాటుకు నవంబరు 25న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదించిన విషయం విధితమే. కొత్త జిల్లా ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పోలవరం జిల్లాలో కలిసే మండలాలు, ఇతర అంశాలను ప్రస్తావిస్తూ కలెక్టర్ ప్రాథమిక నోటిఫికేషన్ చేశారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటుపై పలు ప్రాంతాల్లో ప్రజల నుంచి అభ్యంతరాల నేపథ్యంలో మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. కానీ పోలవరం జిల్లా ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి మార్పులు లేవని ప్రభుత్వం ప్రకటించింది. పూర్తిగా గిరిజన మండలాలతో పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు కానుంది. జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా రంపచోడవరం కేంద్రంగా గిరిజన మండలాలతో పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని రంపచోడవరం, అడ్డతీగల, మారేడుమిల్లి, గంగవరం, వై.రామవరం, దేవిపట్నం, రాజవొమ్మంగి, చింతూరు, కూనవరం, వీఆర్.పురం, ఎటపాక, గుర్తేడు మండలాలు కొత్త జిల్లాలో ఉన్నాయి. కలిపితే పోలవరం నియోజకవర్గంలో పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, టి.నరసాపురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు కలుస్తాయి. ఆయా ప్రాంతీయులకు జిల్లా కేంద్రం చేరువ కావడంతో పాటు అధికారులకు పరిపాలనా సౌలభ్యంగా ఉంటుంది. జిల్లాల పునర్విభజనతో ఇకపై పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 11 మండలాలకే అల్లూరి సీతారామరాజు జిల్లా పరిమితం కానుంది. పోలవరం కొత్త జిల్లా చింతూరు, రంపచోడవరం డివిజన్ల ప్రజలకు పరిపాలన సౌలభ్యంగా ఉంటుంది. రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 12 మండలాల ప్రజలకు జిల్లా కేంద్రం పాడేరు చాలా దూరమైపోయింది. దీంతో తమను అల్లూరి జిల్లా నుంచి వేరు చేయాలనే ఆ డివిజన్ల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పాడేరు జిల్లా కేంద్రం వెళ్లి రావాలంటే రంపచోడవరం డివిజన్ ప్రజలకు 200 కిలోమీటర్లు, చింతూరు డివిజన్ ప్రజలు 350 కిలోమీటర్ల దూరం వెళ్లి రావలసి ఉంది. అలాగే రంపచోడవరం, చింతూరు డివిజన్‌లు ఏఎస్ఆర్ జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడంతో వివిధ శాఖల జిల్లా అధికారులు సైతం పాడేరు డివిజన్‌కే పరిమితమవుతున్నారు. దీంతో ఈ రెండు డివిజన్‌ల వారికి జిల్లా పరిపాలనతో సంబంధం లేకుండా పోయింది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం పోలవరం పేరుతో రంపచోడవరం కేంద్రంగా కొత్త జిల్లాను ప్రకటించడంతో తమ కష్టాలు తీరుతున్నాయని ఏజెన్సీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీనివాస్ యాదవ్‌కి ఘన సన్మానం




**ఎటపాక,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గం అబ్జర్వెర్ కోల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్‌ని వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు నూతన డైరెక్టర్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించడం జరిగింది. సోమవారం వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద స్వామివారి ఆశీస్సులతో కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభ సందర్భంగా ఎటపాక టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, అరకు పార్లమెంట్ కార్యదర్శి మువ్వా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రావి మాధవరావు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఆయనకు అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలంలో ఇంకా మరెన్నో ఉన్నత స్థాయి, రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థిస్తున్నామని వారు తెలిపారు.

# ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన వాడపల్లి






**– ఉత్తర ద్వారం ద్వారా దర్శనం ఇవ్వనున్న శ్రీవారు**
**– అన్ని ఏర్పాట్లు పూర్తి : చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిసి నల్లం సూర్య చక్రధర్ రావు**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున దేవాదాయ శాఖ అందుకు తగినట్లుగా ఏర్పాటు చేస్తుంది. భక్తులకు సౌకర్యాలు ఏర్పాటుతోపాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో పూలమాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేసేలా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావులు ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు. ముక్కోటి ఏకాదశికి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము చర్యలు చేపట్టారు. సుమారు 50వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.

# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో అన్నవరం నృత్య బృందం

**– అంతర్జాతీయ గుర్తింపు లభించిన గురువు ఏలూరి దీపిక**



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం హైద్రాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిన్న జరిగిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు 4,608 కూచిపూడి కళాకారులు పాల్గొన్నారు. అందులో 25 మంది మన అన్నవరం చిన్నారులు ఉన్నారు. గురువు ఏలూరి దీపిక దగ్గర కూచిపూడి నాట్యం నేర్చుకుంటున్న చిన్నారులుకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నారు. ఈ అవార్డు సొంతం చేసుకోవడంతో నాట్య బృంద తల్లితండ్రులు, అన్నవరం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఏలూరి దీపిక మార్గదర్శకత్వంలో క్రమశిక్షణతో కూడిన శిక్షణ పొందిన ఈ చిన్నారులు, గిన్నిస్ రికార్డులో చోటు సంపాదించడం ద్వారా తమ గురువుకు తగిన గురుదక్షిణ సమర్పించుకున్నారు. అన్నవరం వంటి ప్రాంతం నుండి ఇంతమంది కళాకారులను అంతర్జాతీయ వేదికకు పరిచయం చేస్తూ, కూచిపూడి కళా వైభవాన్ని చాటిచెబుతున్న గురువు ఏలూరి దీపికను స్థానిక ప్రజలు మరియు కళాభిమానులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ఈ విజయం ఆమె శిక్షణలో మరెంతో మందికి వర్ధమాన కళాకారులు తయారవ్వడానికి స్ఫూర్తినిస్తుందని కొనియాడారు.

# సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలి




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఈ నెల 31 నుండి జనవరి 4వ తేది వరకు జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని, పెద్దాపురం సిఐటియు మండల కమిటి ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ యాసలపు సూర్యారావు భవనం నుండి ప్రారంభమై సినిమారోడ్డు, వెంకటేశ్వర స్వామి దేవాలయం, మున్సిపల్ సెంటర్, ఆర్ & బి రోడ్డు మీదుగా కొత్తపేట గుర్రాల సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సిరపురపు శ్రీనివాస్ మాట్లాడుతూ సిఐటియు దేశవ్యాప్తంగా కార్మిక ఐక్యత పోరాటం నినాదంతో కార్మికులను సమీకరించి, వారి హక్కుల కోసం పనిచేస్తుందని, ఈ నేపథ్యంలో జరుగుతున్న మహాసభలకు అత్యంత ప్రాధాన్యత సంచరించుకుందని, కావున విశాఖలో జరిగే ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు కార్మికవర్గం అంతా కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, సిఐటియు నాయకులు గుడూరి రమణ, తైనాల శ్రీను, కాకినాడ రామారావు, సత్యనారాయణ, పెంటయ్య, సూరిబాబు, అప్పన్న, బంగార్రాజు, నాగు, గంగ, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ




**పెరవలి, మేజర్ న్యూస్ :** పెర వలి మండల వనరుల కేంద్రం నందు 2026 సంవత్సరపు యూటీయఫ్ డైరీ మరియు కేలండర్‌ను డిసెంబర్ 29వ తేదీ సోమవారం పెరవలి మండల విద్యా శాఖ అధికారులు బి.స్వరూప్, షేక్ సూర్జన్‌లు ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో యూటీయఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వి.వెంకట రమణ, రాష్ట్ర కౌన్సిలర్ పి.వెంకట రాముడు, మండల అధ్యక్షుడు పి.నరేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి డి.వి.యస్. ఆర్ తారా కృష్ణ, సహ అధ్యక్షురాలు వి.రాధిక, జిల్లా మహిళా సబ్ కమిటీ సభ్యులు టి.సిహెచ్.సుమమ్, జిల్లా కార్యవర్గ సభ్యులు యమ్.వి.వి.యస్.ఆర్. రాజేశ్వరరావు, కార్యదర్శులు వి.శ్రీనివాస రెడ్డి, పి.వినయ్ కుమార్, షేక్ సూరా సాహెబ్, పతంజలి తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుమల 'వాడపల్లి' వైభవం

## విశ్వవ్యాప్తమైన ఏడు శనివారాల వెంకన్న ఖ్యాతి!

- ప్రమాణ స్వీకారోత్సవం.. పండుగలా వాడపల్లి
- కూటమిపాలనలో వేగవంతమైన ఆలయ అభివృద్ధి
- రాష్ట్ర స్థాయి గుర్తింపుతో భక్తులకు మెరుగైన సేవలు
- వాడపల్లి వెంకన్న సేవ పూర్వజన్మ సుకృతం : నూతన చైర్మన్





ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :





ఆంధ్రప్రదేశ్ ఆధ్యాత్మిక భూపటంలో 'కోనసీమ తిరుమల'గా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రం నూతన శకాన్ని ప్రారంభించింది. కూటమి ప్రభుత్వ సారథ్యంలో ఆలయ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేసిన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాకుండా, రెండు తెలుగు రాష్ట్రాల ప్రముఖులకు చోటు కల్పించడం ద్వారా వాడపల్లి వైభవం నేడు రాష్ట్ర సరిహద్దులు దాటి విస్తరించిందని స్పష్టమవుతోంది.

**ప్రమాణ స్వీకారోత్సవం... పండుగలా వాడపల్లి :**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుల సమక్షంలో 19 మంది సభ్యులు చలుమూరి రాంబాబు (ఆచంట), గంగవరపు పద్మావతి (ఒంగోలు), కాసా చాముండేశ్వరి (కేతరాజుపల్లి), కొల్లుబోయిన శ్రీనివాసరావు (పెద్దాపురం), పెండెం కుమారి (ర్యాలి), పెండ్యాల భవాని (పాలకొల్లు), సలాది నాగేశ్వరరావు (పెదపళ్ల), సరళ సరిత (మోడేకుర్రు), ఏపుగంటి విజయ కుమారి (వాడపల్లి), చింతపల్లి సత్యనారాయణ (మోడుకుర్రు), తమ్మన సాయి ప్రసాద్ (కొత్తపేట), ఎల్లమల్లి చంద్రకుమారి (కొత్తపేట), కొండపల్లి రామచంద్రరావు (తెలంగాణ), శిష్టా సూర్య కుటుంబరావు (ఆత్రేయపురం), దళపర్తి శ్రీలక్ష్మి (కృష్ణా జిల్లా పామర్రు), గోసాల అప్పలనర (పాయకరావుపేట), ఆలయ ఎక్స్ఆఫీషియో గా వాడపల్లి సుందర శేషవతారం (వాడపల్లి), ప్రత్యేక ఆహ్వానితులుగా మసకపల్లి త్రిమూర్తులు (వానపల్లి) తో కూడిన నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా ముదునూరి వెంకటరాజు ప్రమాణ స్వీకారం చేయగా, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు సభ్యులచే ప్రమాణం చేయించారు.

"వాడపల్లి వెంకన్న సేవలో తరించడం పూర్వజన్మ సుకృతం. దైవకృప, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుల ఆశీస్సుల వల్లే ఈ అవకాశం దక్కింది. భక్తుల సేవలో వాడపల్లి ఖ్యాతిని మరింత పెంచుతాం." – ముదునూరి వెంకటరాజు, నూతన చైర్మన్.

కూటమి పాలనలో 'వేగవంతమైన' అభివృద్ధి.. రూ. కోట్లతో పనుల ప్రారంభంఆధ్యాత్మికతతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు:

– **స్వాతంత్ర సమరయోధుల స్తూపం :** స్ఫూర్తిదాయకమైన ఈ స్తూపాన్ని అద్భుతమైన సెల్ఫీ పాయింట్‌గా తీర్చిదిద్దారు.

– **మౌలిక సదుపాయాలు :** రూ. 80 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన.

– **భక్తుల సౌకర్యార్థం:** రూ. 20 లక్షలతో 'జలప్రసాదం' కౌంటర్, రూ. 9.25 లక్షలతో 'ప్రసాదం' కౌంటర్ ప్రారంభం.

– **రవాణా సౌకర్యం :** సుదూర ప్రాంతాల భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ అందుబాటులోకి.

రాష్ట్రస్థాయి గుర్తింపు.. భక్తులకు మెరుగైన సేవలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, గతంలో కేవలం స్థానిక నియోజకవర్గానికే పరిమితమైన పాలకమండలి నియామకాల్లో, నేడు తెలంగాణ, కృష్ణా, విశాఖ వంటి జిల్లాల ప్రతినిధులకు చోటు కల్పించడం వాడపల్లి పెరుగుతున్న ప్రాముఖ్యతకు నిదర్శనమన్నారు. సామాజిక సమీకరణాలను గౌరవిస్తూ అగ్నికుల క్షత్రి య వర్గానికి చెందిన మసకపల్లి త్రిమూర్తులును ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

**లక్ష్యం : తిరుమల తరహాలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాల కల్పన.**

వందలాది మంది కూటమి నాయకులు, వేలాది మంది భక్తుల జయజ యధ్వానాల మధ్య జరిగిన ఈ కార్యక్రమం వాడపల్లి క్షేత్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. ఏడు శనివారాల మొక్కులతో కోరికలు తీర్చే కోనేటి రాయుడు, ఇప్పుడు సరికొత్త హంగులతో భక్తులకు మరింత చేరువ కానున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రాంబద్ర రాజు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చ అనిల్,కూటమినాయకులు చిలువూరి సతీష్ రాజు, ముల్లపూడి భాస్కరరావు, పి.ఎస్.రాజు, జల్లి కామేశ్వరరావు, జజ్జవరపు హరిబాబు, తోటకూర సుబ్బరాజు, కాయల జగన్నాథం, మద్దూరి సుబ్బారావు, కుదప కృష్ణమూర్తి, నరాలశెట్టి వెంకన్న, జాన వీరాంజనేయులు, నాగిరెడ్డి సత్యనారాయణ, తోట రజిని, దొడ్డపనేని త్రినాధ రావు,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం

### జగ్గంపేట డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** జగ్గంపేటలో తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం జగ్గంపేట డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక, సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట లోని బాలాజీ నగర్‌లో కోన నారాయణమూర్తి అధ్యక్షతన తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం (రిజిస్టర్ నెంబర్ బి. 1245) సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అతిథులుగా ఈపీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి బొబ్బ రవీంద్ర, కాకినాడ జిల్లా అధ్యక్షులు ఎం గణేష్, కార్యదర్శి ఆర్ సత్యనారాయణ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు భారతి వెంకటేశ్వర్లు, కోనసీమ జిల్లా అడ్వైజర్ వై.సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. టిడిపి పార్టీకి చెందిన తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘంలో 327 యూనియన్ నుంచి, మరియు 1104 యూనియన్ లో నుండి సుమారు వంద మంది సభ్యులు తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘంలో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ కార్మికుల సమస్యలు కూటమి ప్రభుత్వంతో పరిష్కారం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి మా యొక్క సమస్యలు పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. డివిజన్ గౌరవ అధ్యక్షులుగా డి. రామకృష్ణ, డివిజన్ అధ్యక్షులుగా డి.శివప్రసాద్,డివిజన్ కార్యదర్శిగా టి.రామకృష్ణ, డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షులుగా బి. వెంకటరమణ, డివిజన్ అదనపు కార్యదర్శిగా సిహెచ్ లక్ష్మణ్, కోశాధికారిగా కె.వీరబ్రహ్మంలను సభ్యులు ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

### గవర్నమెంట్ గరల్స్ హైస్కూల్ విద్యార్థులకు

## స్కిల్ కాంపిటేషన్

## రాష్ట్ర రెండవ బహుమతి




పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో స్థానిక గవర్నమెంట్ గరల్స్ హైస్కూల్ విద్యార్థులకు స్కిల్ కాంపిటేషన్‌లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి, రూ. 15 వేలు నగదు బహుమతి పొందినట్లు హైస్కూల్ ప్రధానొపాధ్యాయులు బి.జె.రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డిఇఓ పి.రమేష్‌తో పాటు డివైఇఓ, ఎంఈఓలు ప్రత్యేకంగా అభినందించినట్లు ప్రధానొపాధ్యాయులు తెలిపారు. అనంతరం హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులను అభినందించినవారిలో ఉన్నారు.

## ఫిట్ ఇండియా కార్యక్రమంలో

### భాగంగా సైకిల్ యాత్ర



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి దిశగా సమాజాన్ని నడిపించాలని ఉద్దేశంతో సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు డి.ఎస్.పి శ్రీహరి రాజు ఆధ్వర్యంలో సామర్లకోట పట్టణంలో సైకిల్ యాత్రను నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్పి శ్రీహరి రాజు, సిఐ కృష్ణభగవాన్‌లు మాట్లాడుతూఈసైకిల్ యాత్రద్వారా యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, క్రమశిక్షణ, బాధ్యతాయుత జీవనం, తల్లిదండ్రుల సంరక్షణలో సరైన మార్గదర్శకత్వంలో ముందుకు సాగాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఎన్నో విజయాలు సాధించవచ్చని మానసికంగా శారీరకంగా దృఢంగా ఉంటే సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావచ్చని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

# డిసెంబర్ 31న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

**– ఇంటి వద్దకే అందజేత ఏర్పాట్లు పూర్తి**
**– కలెక్టర్ కీర్తి చేకూరి**




**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** సోమవారం సాయంత్రం బొమ్మూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో పీజీఆర్ఎస్, రెవెన్యూ సమస్యలు, స్వామిత్వ సర్వే, యూరియా లభ్యత, ఈపీటీఎస్ లీగల్ కేసులు, గృహ నిర్మాణం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జనవరి నెలకు సంబంధించిన పింఛన్లను డిసెంబర్ 31వ తేదీననే పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు డిసెంబర్ 30వ తేదీన పింఛన్ డిస్బర్సింగ్ అధికారులకు అవసరమైన నగదు అందేలా సంబంధిత ఎంపీడీవోలు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,అలాగే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందించాల్సిందిగా స్పష్టం చేశారు.

**–గ్రీవెన్స్ పరిష్కారం, భూ సమస్యలు, యూరియా సరఫరాపై స్పష్టమైన ఆదేశాలు**

గ్రీవెన్స్ ద్వారా అందే అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి పరిశీలించాలని, నిర్దేశిత గాూా గడువు లోపే నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు మళ్లీ రీ–ఓపెన్ అయ్యే పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, సీసీఎల్ఏ మార్గదర్శకాల ప్రకారం నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని తహసీల్దార్లకు సూచించారు.

జిల్లాలో ఫేజ్ – 2 కింద 102 గ్రామాల్లో స్వామిత్వ సర్వే జరుగుతోందని, గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ 100 శాతం పూర్తైందని, 95 గ్రామాల్లో వెక్టరైజేషన్ పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. సర్వే, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేసి స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, ఏవైనా మండలాల్లో కొరత ఏర్పడితే అధిక నిల్వలు ఉన్న మండలాల నుంచి వెంటనే తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రానున్న మూడు రోజుల అవసరాన్ని అంచనా వేసి ప్రతి రోజు సాయంత్రం ఇండెంట్ సమర్పించాలని సూచించారు. అలాగే జిల్లాలో వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కాంటెంప్ట్ కేసులపై ఎలాంటి ఆలస్యం లేకుండా కౌంటర్లు దాఖలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిక పథకాల కింద విడుదలయ్యే నిధులను వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. పుష్కరాలకు సంబంధించి శాఖల వారీగా చేపట్టనున్న పనుల అంచనా వ్యయ వివరాలను త్వరితగతిన సమర్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేస్తూ, సాధారణంగా జనవరి 1న పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లను ప్రజలకు సౌకర్యంగా ఉండేలా ఒక రోజు ముందుగానే డిసెంబర్ 31న ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ వర్గాలకు చెందిన మొత్తం 2,34,076 మంది లబ్ధిదారులకు పెన్షన్లు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకుగాను రూ.102.82 కోట్ల నగదును వినియోగించనున్నట్లు ఆమె వివరించారు. వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితర బలహీన వర్గాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దనే పెన్షన్ అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి, కేఆర్ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ రెడ్డి, కొవ్వూరు, రాజమహేంద్రవరం ఆర్డీఓలు రాణి సుస్మిత, నాయక్, డీఆర్డీఏ పీడీ మూర్తి, జిల్లా అధికారులు, తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో కాకినాడ వాసన్ ఐ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కంటి వైద్య శిబిరాన్ని కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీచైర్మన్ బేతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. చంద్రమాంపల్లి, దివిలి, బి.తాటిపర్తి, పులిమేరు, తిరుపతి, చదలాడ గ్రామాలకు చెందిన ప్రజలు విశేషంగా తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో దివిలి మాజీ సర్పంచ్ కొత్తెం వెంకట శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు రేలంగి బుజ్జి, కంటిబోయిన వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేలంగి వెంకట్రావు, పాస్టర్ ప్రశాంత్ కొమ్మిరెడ్డి బుజ్జి, నూకలమంతి నానాజీ, వెన్న సత్యనారాయణ పండు కంటిబోయిన ప్రసాద్ , రసంశెట్టి సత్తిబాబు, గొల్లపల్లి దేవా, పెంకె సత్తిబాబు, బుజ్జి యూత్ తదితరులు పాల్గొన్నారు.

# గొడ్డలి వేటు జగన్మోహన్ రెడ్డికే సాధ్యం - ఎమ్మెల్యే మద్దిపాటి

**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గొడ్డలి వేటు జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని నియోజవర్గ ఎమ్మెల్యే మద్దిపాడు వెంకటరాజు విమర్శించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాడు వెంకటరాజు ఆధ్వర్యంలో వైసీపీ ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బాలిన వెంకటేశ్వరమ్మ, సాఫ్ట్ డైరెక్టర్ అప్పల వరలక్ష్మి గోపాలపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు గ్రామ ఉపసర్పంచ్ వింత అమర ప్రసాద్ రెడ్డి తో పాటు వైసీపీ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలను భారీగా సోమవారం తెలుగుదేశం పార్టీలోకి తెలుగుదేశం జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేయాలని చూస్తే సహించేది లేదని, నా నియోజకవర్గ ప్రజలను భయభ్రాంతులను చేస్తే సహించేది లేదని బహిరంగంగా హెచ్చరించారు. శాంతి భద్రత ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా వదిలేది లేదని, చట్టపరమైన చర్యలు కఠినంగా తీసుకుంటామని అన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పించి వారి వివరాలను బహిరంగంగా వెల్లడిస్తానన్నారు. అనంతరం స్థానిక రజక పేటలో బురెడ్డి బంగారయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు సుమారు రెండు లక్షల రూపాయలు వాటర్ ట్యాంకు భూమి పూజ చేసి అదే విధంగా ఉపాధి హామీ, 11 నిధులు, పల్లెపడుగు 2.02 లక్షల నిధులతో నిర్మించిన గోకుల షెడ్డు, గ్రామపంచాయతీ ఉపాధి హామీ మండల మండల పరిషత్ నిధులు, 15 లక్షలతో నూతనంగా నిర్మించిన



కోడ్ నెంబర్ 8 అంగన్వాడి కేంద్రాన్ని, ఇందిరమ్మ కాలనీలో 15 లక్షల రూపాయలతో నిర్మించిన కోడ్ నెంబర్ 149 అంగన్వాడి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొర్లపాటి రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు చిన్న వెంకటేశ్వరరావు, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దొంగల సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు బూరెడ్డి వాసు, గోపాలపురం చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షులు ఎడ్లమూడి రమేష్ బాబు, గద్దె హరిబాబు నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ పూనకం ప్రసాద్ బాబు, హాస్పటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమట శ్రీను, టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 6 అర్జీలు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 6 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు తెలిపారు.ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఏఓ సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎడిఎ దైవకుమార్,డిఎల్ఎ ి ఓ కార్యాలయ ఏఓ మైధిలి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, ఐసిడిఎస్ సిబ్బంది రమణమ్మ, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి రోటరీ గోల్డెన్ జూబ్లీ చేయూత

**– డాక్టర్ గోపీనాథ్ వితరణ**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అండగా నిలవడమే రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ లక్ష్యమని ఆ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ అన్నారు. కరపలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలకు తన సొంత నిధులు రూ.30 వేలతో సమకూర్చిన కంప్యూటర్, ప్రింటర్లను పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.ఎస్.రావు చేతుల మీదుగా పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారావుకు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.వి.ఎస్. రావు మాట్లాడుతూ.. విద్యాభి వృద్ధికి డాక్టర్ గోపీనాథ్ చేస్తున్న కృషిని అభినందించారు. ఇప్పటికే హ్యాపీ స్కూల్స్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేశారని, తాజాగా విద్యార్థినుల కోసం సైకిల్ షెడ్ నిర్మాణానికి ముందుకు రావడం ముదావహమన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారావు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 350కి పెంచేలా కృషి చేస్తున్నామని, మరిన్ని మౌలిక వసతుల కల్పనకు దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా, కోశాధికారి ఉదయ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అనంతబాబుపై ఫిర్యాదుల వెల్లువ

**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా చంపుతానంటూ బహిరంగ బెదిరింపులకు పాల్పడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ భాస్కరపై అడ్డతీగల పోలీస్ స్టేషన్‌లో స్థానిక తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎస్సై వినోద్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఇప్పటికే రాజవొమ్మంగి, జడ్డంగి, ఎటపాకతో పాటు 11 మండలాల పరిధిలో అనేక చోట్ల తెలుగుదేశం మరియు కూటమి పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కర్ అనుచిత వ్యాఖ్యలపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం హత్య ఆరోపణలు ఎదుర్కొంటూ బెయిల్ పై ఉన్న ఎమ్మెల్సీ ఒక మహిళ ఎమ్మెల్యే పట్ల బహిరంగంగా బెదిరింపులు పాల్పడడం చూస్తుంటే గతంలో నమోదైన కేసుల్లో బాధితుల పట్ల ఏ విధమైన బెదిరింపులకు పాల్పడి ఉంటాడో అర్థం చేసుకొని అతని బెయిల్ రద్దుచేసి కఠిన శిక్ష విధించాలని నియోజకవర్గ కూటమి నేతలు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

# సమస్యల వేగవంత పరిష్కారానికే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ

– శాసనసభ్యులు వనమాడి కొండబాబు



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు వేగవంతమైన పరిష్కారాలు అందించాలనే లక్ష్యంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 32, 33, 34, 35 డివిజన్లకు సభంధించి పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో మధ్యాహ్నం 27, 28, 29, 30, 31 డివిజన్లకు సంబంధించి అన్నదాన సమాజంలోనూ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ స్మార్ట్ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పాల్గొని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటికి పరిష్కారం మార్గాలు చేపట్టడమే కొరకు ప్రజాదర్బార్ నిర్వహించడం జరుగుతుందని, నగర అభివృద్ధి, మౌలిక వసతులు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు తదితర అంశాలపై ఫిర్యాదులు తగ్గుముఖం పట్టాయని అన్నారు. ప్రస్తుతం వ్యక్తిగత పెన్షన్, ఇళ్ల స్థలాల కోసం ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని వాటిని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సమయపాలనతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను అక్కడికక్కడే నమోదు చేసి, త్వరితగతిన పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువయ్యేలా చేస్తాయని, ప్రజాసమస్యలపై నేరుగా స్పందించడానికి ఇవి దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్, టిపిఆర్ఓ శైలజ, డిసిపి కృష్ణారావు, డి.కనకారావు, స్థానిక కూటమి శ్రేణులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, ఎస్.కె.రహీం బాబు, గుజ్జు దుర్గ లక్ష్మణరావు, బంగారు సూర్యావతీ సత్యనారాయణ, చింతలపూడి రవి, రిక్క లక్ష్మి, పొంగ బుజ్జి, పసుపులేటి వెంకటేశ్వరరావు, గోపిశెట్టి బూరయ్య, కోడూరి పెద్ద, రెడ్డనం సత్తిబాబు, నేమాని సత్యనారాయణ, చిట్టిబాబు, మనోహర్ గుప్తా, అమలకంటి బలరాం, పొంగా సత్య, గబ్బర్ సింగ్, బాక్సర్, తోట రెడ్డి, కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకంగా కల్వర్టు నిర్మాణ పనులు

– పనులను అడ్డుకున్న జనసేన నాయకులు, స్థానికులు

సామర్లకోట,మేజర్‌న్యూస్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధి ధ్యేయంగా సామర్లకోట పట్టణ పరిధిలో పలువార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు,కల్వర్టు నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుంది.కాగా పలుప్రాంతాల్లో చేపట్టిన పనులను సంబధిత కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపడుతున్నా రన్నా ఆరోపణలు ఉన్నాయి. తాజాగా 14వ వార్డు జగదీశ్వర స్వామి ఆలయం ప్రక్కన నూతనంగా నిర్మిస్తున్న పనులు ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చును. కల్వర్టుకు సంబంధించిన గోడను సుమారు అడుగు పైబడి చేపట్టాల్సి ఉండగా కేవలం 6నుండి 8అంగుళాలు మాత్రమే నిర్మించారు. సోమవారం కల్వర్టు స్లాబ్ కి సంబంధించి నాసి రకంగా ఉన్న 8ఎం.ఎం వంటి ఊచలతో నిర్మాణాలు చేపడుతుండగా స్థానిక జనసేన నాయకులు,స్థానికులు పనులను నాణ్యత లేని పనులను అడ్డుకుని నిలుపుదల చేసి, మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. దీనిపై జనసేన నాయకులు అల్లం అయ్యప్ప,కానూరి పవన్ కుమార్,సందక వీరబాబు,అమలదాసు దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో అధికారుల అజమాయిషి లేకపోవడం వలన నాణ్యతలేని నిర్మాణాలు కాంట్రాక్టర్లు చేపడుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు కల్వర్టు నిర్మాణం పనులను పరిశీలించి నాణ్యతగా కూడిన పనుల చేపట్టాలని డిమాండ్ చేశారు.



# వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యతను పెంపొందించేలా విద్య ఉండాలి





– చాగంటి కోటేశ్వరరావు

కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం ఆలుమ్నీ ఆడిటోరియంలో "విద్యతో ఉన్నత విలువలు – సామాజిక పరివర్తన" అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్టూడెంట్స్ ఎథిక్స్ & వాల్యూస్ సలహాదారుగా సేవలందిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు విశిష్ట అతిథిగా పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులకు స్ఫూర్తిదాయక సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె ప్రసాద్ విచ్చేశారు. ఈ కార్యక్రమానికి యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్.మోహన్‌రావు అధ్యక్షత వహించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ, విద్య అనేది కేవలం ఉద్యోగాలు లేదా డిగ్రీలకే పరిమితం కాకుండా, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, కర్తవ్యబోధ మరియు సమాజం పట్ల బాధ్యతను పెంపొందించే శక్తిగా ఉండాలని పేర్కొన్నారు. యువత జ్ఞానంతో పాటు ధర్మబద్ధమైన ఆలోచన, సత్యనిష్ఠ, మానవీయతను అలవరుచుకుంటేనే సమాజంలో నిజమైన మరియు స్థిరమైన మార్పు సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే.ప్రసాద్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం విద్యార్థుల్లో నైతికత, క్రమశిక్షణ మరియు మానవ విలువలు పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని, ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించాలి - ఛైర్‌పర్సన్



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : అధికారులు అభివృద్ధిపై దృష్టిపెట్టాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు సూచించారు. సోమవారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు త్రాగునీరు, వీధిలైట్లు, పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టాలని, తెలిపారు. కౌన్సిల్ అజెండాలోని పలు అంశాలు, అభివృద్ధిపై చర్చించడం జరిగింది. అనంతరం బడ్జెట్‌పై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. దీనితో పాటు పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డులలో సమస్యలపై సమావేశంలో లేవనెత్తారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, ఆర్వో అచ్యుతరాజు, మున్సిపల్ టిపిఓ చింతాఫణి కుమార్, ఏఇలు ఉమామహేశ్వరి, పి.వి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఆర్ఐ గంగాధర్, కౌన్సిలర్ గుమస్తా అత్తిలి వీర్రాజు, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

## హర హర మహాదేవ శంభో శంకర అంటూ గజగజ వనికేచలిలో భక్తులు




రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు గజగజ వనికే చలిలో ఆ మహాదేవుని దర్శించుకున్నారు. సోమవారం మండల కేంద్రమైన రాజవొమ్మంగి శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని భక్తులు మంచు తెరల మధ్య ప్రయాణించి దర్శించుకోవడం జరిగింది. అలానే 42 రోజులు పాటు అయ్యప్ప స్వామి దీక్షను పూర్తిచేసుకుని గ్రామానికి చెందిన కవల తాతారావు, అతని కుమారుడు, మరో స్వామి ఆ మహాదేవుని సన్నిధిలో స్థానిక పురోహితులు శ్రీనివాసరావుతో పూజలు నిర్వహించి ఇరుముళ్ళు కట్టించుకోవడం జరిగింది. బంధుమిత్రుల సమక్షంలో ఇరుముళ్ళు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అలానే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శీతాకాలం ప్రారంభం అయినప్పటి నుండి స్వామివారి కొండపై నుండి చూస్తే మంచు తెరలు ఆహ్లాదకరంగా అరకు అందాలను పోలినట్లుగా ఉన్నాయి. ఒకపక్క శివాలయం కొండపైకి భక్తులు తాకిడి, మరో ప్రక్క ప్రకృతి రమణీయత కనులు విందు చేస్తున్నాయి.

## విద్యాభివృద్ధికి రోటరీ గోల్డెన్ జూబ్లీ చేయూత

– డాక్టర్ గోపీనాథ్ వితరణ



కాకినాడ, మేజర్ న్యూస్ : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అండగా నిలవడమే రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ లక్ష్యమని ఆ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ అన్నారు. కరపలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలకు తన సొంత నిధులు రూ. 30 వేలతో సమకూర్చిన కంప్యూటర్, ప్రింటర్లను పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.ఎస్. రావు చేతుల మీదుగా పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.వి.ఎస్. రావు మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి డాక్టర్ గోపీనాథ్ చేస్తున్న కృషిని అభినందించారు. ఇప్పటికే హ్యాపీ స్కూల్స్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేశారని, తాజాగా విద్యార్థినుల కోసం సైకిల్ షెడ్ నిర్మాణానికి ముందుకు రావడం ముదావహమన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారావు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 350కి పెంచేలా కృషి చేస్తున్నామని, మరిన్ని మౌలిక వసతుల కల్పనకు దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా, కోశాధికారి ఉదయ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా నేత మంత్రి సుభాష్ విజయం





- కోటిపల్లి రేవు పున'ప్రారంభంతో తీరిన కోనసీమ కష్టాలు!
- మంత్రి లోకేష్ అడుగుజాడల్లో సంస్కరణల బాట..
- తండ్రి ఆశయాలతో ప్రజా సేవలో

అపర భగీరథుడు మంత్రి వాసంశెట్టి సుభాష్!

**"రాజకీయాల్లో యువ నాయకత్వానికి సరికొత్త అర్థం చెబుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వేగాన్ని, పట్టుదలను స్ఫూర్తిగా తీసుకుని దూసుకుపోతున్నారు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. పెండింగ్‌లో ఉన్న కోటిపల్లి రేవు పునఃప్రారంభం ద్వారా అసాధ్యమనుకున్న దానిని సుసాధ్యం చేసి, కోనసీమ ప్రజల గుండెల్లో 'ప్రజా హృదయ విజేత'గా నిలిచారు. లోకేష్ అడుగుజాడల్లో సంస్కరణలే లక్ష్యంగా, తండ్రి వాసంశెట్టి సత్యం ఆశయాలతో ఆయన సాగిస్తున్న ఈ 'అపర భగీరథ ప్రయత్నం' నేడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది." దీనిపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో కొమ్మన సతీష్ అందించిన క్షేత్రస్థాయి నుంచి ప్రత్యేక కథనం...**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు గుండెకాయ లాంటి కోటిపల్లి రేవు ఎట్టకేలకు తిరిగి ప్రారంభమైంది. ఇది కేవలం ఒక రేవు ప్రారంభం కాదు.. కోనసీమ ప్రజల ప్రయాణ కష్టాలను తుడిచిపెట్టిన మంత్రి వాసంశెట్టి సుభాష్ రాజకీయ సంకల్పం!

నారా లోకేష్ స్ఫూర్తితో.. సమస్యలపై సమరం! యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పనితీరును స్ఫూర్తిగా తీసుకున్న సుభాష్, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తనదైన ముద్ర వేస్తున్నారు. మంత్రి లోకేష్ ఏ విధంగానైతే సాంకేతికతను, వేగాన్ని మేళవించి పాలన సాగిస్తున్నారో, అదే బాటలో సుభాష్ కూడా అధికారులను సమన్వయం చేస్తూ, అసాధ్యమనుకున్న కోటిపల్లి రేవు పునఃప్రారంభాన్ని సుసాధ్యం చేశారు.

"యువ నాయకత్వం - ప్రజా పక్షపాతం" అనే నినాదంతో ఆయన ముందుకు సాగుతున్న తీరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

తండ్రికి తగ్గ తనయుడు - సత్యం ఆశీస్సులతో..

మంత్రి సుభాష్ తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు, వాసంశెట్టి సత్యం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వాసంశెట్టి సత్యం సోమవారం ఉదయం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి రేవు పంటును ప్రారంభించారు. దశాబ్దాలుగా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న సత్యం అన్న అడుగుజాడల్లో నడుస్తూ, సుభాష్ అందిస్తున్న పాలన పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. "సేవలో తండ్రి.. పాలనలో కొడుకు" అన్నట్టుగా వీరిద్దరూ కలిసి కోనసీమ రూపురేఖలు మారుస్తున్నారని స్థానికులు కొనియాడుతున్నారు.

ప్రజలందరి ఆనందం - అమలాపురానికి చేరువ! కోటిపల్లి రేవు ప్రారంభంతో అమలాపురం వెళ్లే ప్రయాణికులకు దూరం భారంతో పాటు సమయం కూడా ఆదా కానుంది. "హమ్మయ్య.. మంత్రి సుభాష్ పుణ్యమా అని మా కష్టాలు గట్టెక్కాయి" అంటూ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జేజేలు పలుకుతున్నారు. లోకేష్ మార్గదర్శకత్వంలో మంత్రి సుభాష్ తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిపెడుతున్నాయి.

ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో రేవు నిర్వాహకులు రేవు శ్రీను, కర్రి చిట్టిబాబు, కంచుమర్తి బాబురావు, పెమ్మాడి సత్తిబాబు, రవ్వా భూషణం, వెంకటేష్, తడాల లోవరాజు మరియు భారీ సంఖ్యలో కూటమి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ముగింపు : ప్రజల పక్షాన నిలిచి, అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్ పేరు నేడు ఉభయ గోదావరి జిల్లాల్లోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా "ప్రజా హృదయ విజేత"గా మారుమోగుతోంది.

# రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంక్ సాధించిన డాక్టర్ కే.శ్రీ జాహ్నవి







- ఎన్.టి.ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఫలితాల్లో సంచలనం
- గైనకాలజీ విభాగంలో దక్కిన గౌరవం

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య రంగంలో మరో ఆణిముత్యం మెరిసింది. ఎన్.టి.ఆర్ హెల్త్ యూనివర్సిటీ తాజాగా విడుదల చేసిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ మెడికల్ ఫైనల్ మెరిట్ జాబితాలో డాక్టర్ కే.శ్రీజాహ్నవి రాష్ట్ర స్థాయిలోనే అద్భుత ప్రతిభ కనబరిచారు. గైనకాలజీ విభాగంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న 34 ప్రభుత్వ మరియు ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు చెందిన విద్యార్థులలో ఆమె స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించి రికార్డు సృష్టించారు.

**ప్రజా సేవకే నా ప్రథమ ప్రాధాన్యం :**రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకర్ కావడంతో ప్రభుత్వం తరపున సీనియర్ రెసిడెంట్‌గా తనకు నచ్చిన బోధ నాసుపత్రిని ఎంచుకునే అవకాశం శ్రీజాహ్నవికి దక్కింది.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.."రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ విజయం నా ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్, హెచ్.ఓ.డి మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహంవల్లేసాధ్యమైంది.సీనియర్ రెసిడెంట్‌గా 6నెలలు బోధనాసు పత్రిలోనూ,మిగిలిన 6 నెలలు గ్రామీణ ప్రాంతాల్లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో పేదమహిళలకు వైద్య సేవలు అందించాలనినిర్ణయించుకున్నాను"అనితన సేవాదృక్పథాన్ని చాటుకున్నారు. విద్యావంతుల కుటుంబం నుండి వచ్చిన ఆణిముత్యంనిడాక్టర్ శ్రీజాహ్నవి తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, వేమగిరితోట మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ ఉపాధ్యాయ సంఘ నాయకులుకే. జయ రాజు కుమార్తె. ఆమె సోదరుడు రామాంజన్ (టిసిఎస్ అగ్రి బిజినెస్ మేనేజర్), వదిన కుందర వదన (పిఎన్ బిమేనేజర్)లు ఆమెను అభినందిస్తూ.. తమ ఇంట్లో 'చదువుల సరస్వతి' పుట్టడం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు.

**-ప్రముఖుల ప్రశంసల జల్లు :** రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన డాక్టర్ జాహ్నవిని పలువురు ప్రముఖులు అభినందించారు. అభినందించిన వారిలో రాజ్యసభ సభ్యులు జి.బాబురావు,శాసన సభ్యులుగోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప,మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, శాసన మండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం,ఐఎూ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు గోరంట్ల రవికిరణ్, కడియం మండల అధ్యక్షులు వి. సత్యప్రసాద్ ఇతర ప్రముఖులు ఉన్నారు.

# సారాయి స్మగ్లర్లకు 'షాక్'..

- నేరం చేస్తే జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే!
- కాకినాడ ఎక్సైజ్ కోర్టు సంచలన తీర్పు
- నిందితుడికి ఏడాది జైలు, భారీ జరిమానా



**కాకినాడ, మేజర్ న్యూస్ క్రైం :** నాటు సారాయి అక్రమ రవాణా ద్వారా ఈజీగా డబ్బు సంపాదించాలనుకునే వారికి కోర్టు గట్టి హెచ్చరిక పంపింది. చట్టం కళ్ళు గప్పి తప్పించుకోవచ్చని భావించే వారి ఆటలు ఇక సాగవని నిరూపిస్తూ, కాకినాడ ఎక్సైజ్ కోర్టు ఒక కీలక తీర్పును వెలువరించింది. ఐదేళ్ల క్రితం జరిగిన నాటు సారాయి కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు పదివేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.నిఅసలేం జరిగిందంటే?నికొత్త కాకినాడకు చెందిన కొనడ ముత్యాలు అనే వ్యక్తి, 2020 మే నెలలో తన ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల నాటు సారాయిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులకు చిక్కాడు. కేవలం 20 లీటర్లే కదా.. ఏదోలా బయటపడొచ్చు అనుకున్న సదరు నిందితుడికి నేడు చట్టం తన ప్రతాపాన్ని చూపింది.నిన్యాయం వైపే తీర్పు:నిఎక్సైజ్ అధికారులు పక్కా ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేయగా, విచారణ చేపట్టిన స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆనం నాగ మల్లేశ్వరి నిందితుడు చేసిన నేరం రుజువు కావడంతో శిక్షను ఖరారు చేశారు. జైలు శిక్షతో పాటు ఆర్థికంగా కూడా భారీ జరిమానా విధించడం గమనార్హం.ఈ తీర్పుపై కాకినాడ నార్త్ స్టేషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె. రామ మోహన రావు స్పందిస్తూ హెచ్చరికలు జారీ చేశారు: "నాటు సారాయి తయారీ చేసినా, అమ్మినా, చివరకు రవాణా చేసినా ఎవరినీ ఉపేక్షించేది లేదు. ప్రతి కదలికపై మా నిఘా ఉంటుంది. పట్టుబడితే జీవితాలు జైలు పాలు కావడమే కాకుండా, పరువు కూడా పోతుంది. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. "నిముగింపు:నినేరం చిన్నదైనా, పెద్దదైనా నాటు సారాయి వంటి సామాజిక రుగ్మతలకు పాల్పడే వారికి ఈ తీర్పు ఒక కనువిప్పు కావాలి. కేవలం తక్షణ లాభం కోసం అక్రమ మార్గాల్లో వెళ్తే, వెనక ఉన్న కుటుంబం రోడ్డున పడుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ వ్యాపారులు తమ పంథా మార్చుకోకపోతే కటకటాల వెనక్కి వెళ్లడం ఖాయం!

# కాకినాడలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ బార్ అసోసియేషన్ ఆవరణలో సోమవారం ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్‌ఏ) నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు సుబ్రహ్మణ్యం మరియు కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు (చంటి) ముఖ్య అతిథులుగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు జీవి కృష్ణ ప్రకాష్, పి.ప్రసన్నకుమార్, ఏ.వి.సిహెచ్.మూర్తి, ఆల్తఫ్ మహమ్మద్ మరియు యనమల రామం పాల్గొని ప్రసంగించారు. ఐఎల్‌ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టి.పృదురాజ్ మరియు ఉపాధ్యక్షులు కోలా శ్రీహర్రావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంగా శివరామకృష్ణ, వడ్డీ శ్రీనివాస్ బాబు, జీవి రమణ, వారా రాజబాబు, ప్రవల్లిక, ప్రేమ్ నజీర్, మంగరాజు, కుటుంబరావు మరియు ముఖేష్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ బండి నరేంద్రతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అధిక సంఖ్యలో న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. న్యాయవాదుల సంక్షేమం మరియు వృత్తిపరమైన అభివృద్ధికి ఐఎల్‌ఏ నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలియజేశారు.

# పచ్చని మొక్కల ప్రదర్శన



**కాకినాడ, మేజర్ న్యూస్ :**స్థానిక గాడ్స్ క్రియేషన్స్ గిఫ్టింగ్ ప్లాంట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 31 మరియు జనవరి 1వ తేదీలలో రెండు రోజులపాటు స్థానిక వివేకానంద పార్క్ (కొళాయి చెరువు) గేటు దగ్గర ప్రత్యేక పచ్చని మొక్కల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకురాలు మైలవరపు సుమన సత్యనారాయణ తెలిపారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పచ్చదనాన్ని వ్యాప్తి చేసి మరియు స్థిరత్వాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యాన్ని అందరూ కొనసాగించడానికి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రానున్న సంవత్సరం మన అందరం కలిసి కొత్త మార్పుకు శ్రీకారం చుడదామని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఒక మొక్కను బహుమతిగా అందజేసి శుభాకాంక్షలు తెలుపుతూ పర్యావరణాన్ని సంరక్షిద్దామని ఆమె కోరారు. వివేకానంద పార్క్ పక్కన ఉన్న మా మొక్కల స్టాల్‌ని అందరూ సందర్శించాల్సిందిగా ఆమె ఆహ్వానించారు. మరింత పచ్చని రేపటిని పెంచడం ద్వారా ప్రోత్సహిద్దామని మేము చేస్తున్న గ్రీన్ క్యాంపెయిన్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా ఆమె కోరారు. అందరి సహకారంతో పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని కొత్త సంవత్సరంలోనూ కొనసాగిద్దామని దాని ద్వారా సమాజానికి మేలు చేసే విధంగా మన కార్యక్రమాలను రూపొందించుకుందామని సుమన సత్యనారాయణ ఆహ్వానించారు. 2018వ సంవత్సరములో ఈ సంస్థను స్థాపించడం జరిగిందని అనాటి నుండి కట్ ఫ్లవర్ బొకేల సంస్కృతికి స్వస్తి పలికి వాటి స్థానంలో సజీవమైన మొక్కలను బహుమతిగా అందించే వినూత్న వొరవడికి శ్రీకారం చుట్టి ప్రోత్సహించడం జరిగిందని సుమన సత్యనారాయణ గుర్తు చేశారు. తమ సంస్థ ప్రధాన ఆశయం పర్యావరణ పరిరక్షణ, మొక్కల ద్వారా ప్రాణవాయువును పెంచడం, శాశ్వత జ్ఞాపకం. వాడిపోయే పూల కంటే ఎదుగుతూ ఉండే మొక్కల బహుమతి ఇచ్చిన వారి ప్రేమ ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటాయని ఆమె విశ్లేషించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ఇండోర్ మరియు అవుట్ డోర్ మొక్కల ద్వారా మన ఇంటి వాతావరణన్ని అహ్లాదకరంగా మార్చడం వంటి వినూత్న ఆలోచనలను అమలు చేయడమే తమ లక్ష్యమని, ఆరోగ్యకర సమాజ ఆవిర్భావానికి తమ వంతు సేవ చేస్తున్నామని, అందరూ ప్రోత్సహించడం ద్వారా కాలుష్య రహిత నగర వాతావరణ కేంద్రంగా కాకినాడను తీర్చిదిద్దేందుకు అవకాశం ఏర్పడుతుందన్న అభిప్రాయాన్ని సుమన సత్యనారాయణ వ్యక్తం చేశారు.

ఇతర వివరాలకు 94402 76788 లో సంప్రదించవచ్చని ఆమె కోరారు.

# ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం గోవింద గిరిపై తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు సోమవారం తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి రూపుసాయి, ఢిల్లీ ప్రసాద్, అర్చక స్వాములు శ్రీ పార్ధస్వామి, శ్రీమణికంఠ స్వామి తెలియ చేసారు. మంగళవారం ఉదయం 3:30 నుండి 5:00 గంటల వరకు ప్రత్యేక పూజలు



నిర్వహిస్తారు. అలాగే ఉదయం 5:00 గంటలనుండి సాయంత్రం 5:00గంటల వరకు భక్తులకు స్వామివారు ఉత్తర ద్వార దర్శనం ఇస్తారు. అనంతరం మిగిలిన పూజా కైంకర్యములు యధావిధిగా జరుగుతాయి. మంగళవారం నిమధ్యాహ్నం శ్రీవారి సేవకులచే అన్నప్రసాద వితరణ జరుగుతుంది. మరుసటి రోజు బుధవారం ఉదయం 9:00 గంటల నుండి స్వామివారి తిరుమాడవీది సేవ ఉంటుంది.

పల్లకి సేవలో పాల్గొనే పురుషులు విధిగా తెలుపు రంగు పంచె, భుజాన కండువా ధరించాలని సూచించారు.

భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావలసినదిగా కో–ఆర్డినేటర్ నల్లమిల్లి వేంకట రామారెడ్డి విజ్ఞప్తి చేసారు.

# తెలుగుదేశం ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు



**– ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీలో కార్యకర్తల కృషి అమూల్యమని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి అన్నారు. రంపచోడవరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో ఉత్తమ కార్యకర్తల ప్రశంస పత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ మన పార్టీ సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్యకర్తలను జాతీయ పార్టీ గుర్తించినట్లు పేర్కొన్నారు. దానిలో కష్టపడి మంచిగా సేవలశీదించి మన పార్టీ యాప్ లో నమోదు చేసిన వారిని జాతీయ పార్టీ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ప్రశంసా పత్రాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ అందరికీ గుర్తింపు ఉంటుందన్నారు. మన నియోజకవర్గంలో కొన్ని చోట్ల అంతర్జాల సేవలు అందుబాటులో లేకపోయినా కార్యకర్తలు చురుకుగా పార్టీ కోసం పని చేయడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ప్రశంసలు అందుకోవడం గర్వకారణమన్నారు. ఇకముందు ప్రజాసేవలో ముందుకు కొనసాగాలని కోరారు. మీలాంటి ఉత్తమ కార్యకర్తలు పార్టీలో ఉండటం శుభపరిణామమన్నారు. అనంతరం జాతీయ పార్టీ కార్యదర్శి నారా లోకేష్ సంతకం చేసి ఫ్రేమ్‌లతో వచ్చిన ఉత్తమ కార్యకర్తల ప్రశంసా పత్రాలను అందజేశారు.

వారిలో పెద్దాడ నూకరాజు, బుచ్చిరాజు శ్యామల, ఎచ్చు రాము, కొట్టి రవీంద్ర బాబు, చవలం కుమార్ బాబు, సంకురు పెంటమ్మ, గోగులోతు. శ్రీను, అన్నిక నాగేశ్వరరావు తదితరులకు ఆమె చేతులు మీదుగా శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ కార్యకర్తలు మాట్లాడుతూ మమ్మల్ని పార్టీ గుర్తించి ఇలా ప్రోత్సహం ఇవ్వటం మరచిపోలేని సంఘటనని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు షేక్ చోటు, అరకు పార్లమెంట్ ఎస్టీ విభాగం నాయకులు ఇల్లా చిన్నారెడ్డి, సీతపల్లి బాపనమ్మ తల్లి దేవస్థానం సభ్యులు సిద్ధా వెంకన్నదొర, సాధల సత్య తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థానం గోశాల షెడ్ ప్రారంభం




**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానము గోశాలలో సుమారు రూ.17 లక్షల నిధులతో (సిఎస్ఆర్) నిర్మించిన షెడ్ ను భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (ప్రభుత్వ రంగ సంస్థ) ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఏ.మాధవరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ఉన్నతాధికారులు సత్యనారాయణ, విశాఖపట్నం యూనిట్ జనరల్ మేనేజర్ శ్రీధర్ సింగ్ మరియు సిబ్బంది, దేవస్థానం డిప్యూటీ కమీషనర్ బాబురావు, పిఆర్ఏ. ప్రసాద్ మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం శ్రీ స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా డిప్యూటీ కమిషనర్ బాబురావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ అనకాపల్లి ప్రసాద్, దేవస్థాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**– ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు**



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిసెంబర్ 31న ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి ఒక్కరు డివిజన్ పరిధిలో ఉన్న ఆదివాసి పల్లెలలో ఆదివాసి జెండాను ఎగరవేసి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆదివాసీలకు పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో రాజ్యాంగం కల్పించినటువంటి 1/70 చట్టం, పిసా చట్టాలు సక్రమంగా అమలు చేయడం లేదు అన్నారు. ఆదివాసుల మీద గిరిజన నేతలు భూ అక్రమాలు చేస్తూ ఆదివాసులను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టాలను తన ఆధీనంలో తీసుకుంటూ రాజకీయాల వైపు ఆదివాసులను లాక్కునే పరిస్థితులు ఈ ప్రాంతంలో ఉన్నాయి అని అన్నారు. పోలవరం ప్రాజెక్టు వలన ఆదివాసులు జల సమాధి అయ్యే పరిస్థితులు ఉన్నాయని, ఆదివాసులకు నష్టపరిహారం ఇచ్చే విషయంలో ప్రతి ఒక గ్రామాన్ని ముంపుగా ప్రకటిస్తామని ఆ రోజున హామీలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఇప్పుడు కాంటూర్ ల పేరుతో గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటిస్తామని ప్రకటించకుండా సొంత నిర్ణయాలతో ఆదివాసులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ల్యాండ్ కు ల్యాండ్, భూములను సేకరించి భూములు అప్పచెప్పుతామని ఇంతవరకు కూడా ఆ భూములు అధికార పూర్వకంగా ఆదివాసులకు ఇంత వరకు అప్ప చెప్పింది లేదు అని, ఇండ్ల సర్వే చేసి సరైన నష్టపరిహారం కూడా ఇవ్వలేదని,18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి సర్వే చేసి న్యాయంగా ఇవ్వకుండా సర్వేలు చేసి కొంతమంది పేర్లను మాత్రమే పిడిఎఫ్ ద్వారా పెట్టడం జరిగిందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలి అని, అనంతరం పోలవరం నిర్వాసితుల అయిన ఆదివాసులకు సరియైన న్యాయం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ సహాయ కార్యదర్శి కుంజా శ్రీను, ఆదివాసి సంక్షేమ పరిస్థితి డివిజన్ అధ్యక్షులు కారం రవి, పల్లాల రమణారెడ్డి, మిడియం దుర్గారావు, మీడియం చెల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.